క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధే ఎజెండా



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ఎజెండా అని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని దాచారం నుంచి బోటిమీదపల్లి వరకు రూ.2.41 కోట్ల వ్యయంతో నిర్మాణం చేయబోతున్న బీటీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ రూ.వేల కోట్లతో సీసీ రోడ్లు, మురుగునీటి కాలవలు, బీటీ రోడ్లు, గ్రామాల్లో కులసంఘ భవనాలు, ఇతర అభివృద్ధి పనులు చేశారన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతు బీమా పథకాలను తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం పెద్దమ్మ జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, సర్పంచ్ పర్శరాం, ఎంపీటీసీ తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో దశల వారీగా అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కుమార్

చందుర్తి: జెడ్పీ నిధులతో దశల వారీగా అభివృద్ధి చేపడుతున్నట్లు జెడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. మండలంలోని జోగాపూర్ బస్టాండ్ ప్రాంతంలో సైడ్ డ్రైనేజీ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో పనులు చేయించలేకపోతున్నట్లు ఆవేదనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్శరాములు, ఎంపీటీసీ గణేశ్, ఉపసర్పంచ్ గంట మల్లేశం పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో ఆధార్ నమోదు కేంద్రాన్ని సర్పంచ్ తన్నీరు గౌతంరావు గురువారం ప్రారంభించారు. పెద్ద గ్రామం కావడంతో చాలామంది ఆధార్ కోసం ముస్తాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రజల సౌకర్యార్థం పోతుగల్‌లో ఆధార్ నమోదు కేంద్రాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారన్నారు. మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, ఉపసర్పంచ్ మంజుల, ఎంపీటీసీ బాలకిషన్ పాల్గొన్నారు.

శ్రీఆంజనేయం



సిరిసిల్ల విద్యానగర్ హనుమాన్ ఆలయంలో చైర్‌పర్సన్ జిందం కళ పూజలు



ఎల్లారెడ్డిపేటలో పూజలు చేస్తున్న మహిళలు

జిల్లాలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నగర సంకీర్తనతో ప్రారంభమైన వేడుకల్లో భక్తులు స్వామివారిని చందనంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పఠనం చేస్తూ ఉపవాస దీక్షలు ఆచరించారు. హనుమాన్ మాలధారులు ఆయా గ్రామాల్లో శోభాయాత్రలో భజన పాటలు, నృత్యాలతో అడుగడుగున 'భజరంగ్ భళీకి జై, జై హనుమాన్, జై శ్రీరాం' నినాదాలతో భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. హనుమాన్ దీక్షాపరుల భజనలు, కీర్తనలతో ఆలయాలు మారుమోగాయి. సిరిసిల్లలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి,ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బోయినపల్లి మండలంలోని నీలోజపల్లి హనుమాన్ ఆలయంలో రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, వేములవాడరూరల్ సీఐ భన్సీలాల్, ఎస్సై మామిడి మహేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్

కల్యాణం.. కమనీయం



కల్యాణంలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్/చందుర్తి: వేములవాడ మండలంలోని ఎదురుగట్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. గ్రామ సర్పంచ్ సోయినేని కరుణాకర్ లహరి, ఆలయ కమిటీ చైర్మన్ కడారి తిరుపతి దంపతులు తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. చందుర్తి మండలంలోని కిష్టంపేటలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, మాజీ సర్పంచులు బానాల గంగారెడ్డి, కోమటిరెడ్డి సత్తిరెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ పాలకవర్గం ప్రసాదం అందజేశారు.

గ్రహణం వీడని గ్రంథాలయం

- సొంత భవనానికి నోచుకోని వైనం
- ఇరుకు గదులతో పాఠకుల ఇబ్బంది



స్థలం లేక సంచుల్లో కట్టకట్టిపెట్టిన పుస్తకాలు



అద్దె భవనంలో సాగుతున్న గ్రంథాలయం

కోనరావుపేట: గ్రంథాలయాలు ప్రస్తుతం పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి వరంగా మారాయి. యువతకు ఎంతో ఉపయోగకరమైన గ్రంథాలయాలపై పాలకుల శ్రద్ధ కరువైంది. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతో గ్రంథాలయ పాలకులకు, పాఠకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో గ్రంథాలయం కొన్నేళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. గతంలో గ్రామపంచాయతీ భవనంలో ఉన్న ఈ గ్రంథాలయాన్ని అద్దె భవనంలోకి మార్చారు. ప్రస్తుతం స్థానిక మున్నూరు కాపు సంఘ భవనంలో కొనసాగుతోంది.

ఇరుకు గదులతో ఇబ్బందులు

గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడం ప్రధాన సమస్య. అద్దె భవనంలో రెండు చిన్న గదుల్లో గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఇరుకుగా ఉన్న గదిలో రెండు వైపులా ర్యాకులు అమర్చి పుస్తకాలను ఏర్పాటు చేశారు. ఈ గదిలోకి ఒకరు వెళితే మరొకరు వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రంథాలయంలో 7,800 పైగా పుస్తకాలున్నాయి. వీటితో పాటు ప్రతిరోజూ దిన పత్రికలు, ఇతర వార, మాస పత్రికలు వస్తుంటాయి. వీటన్నింటినీ భద్రపర్చడం సమస్యగా మారింది. ప్రస్తుత గదుల్లో స్థలం సరిపోకపోవడంతో పుస్తకాలను సంచుల్లో వేసి మూలన పడేశారు. దీంతో ప్రతిరోజూ వచ్చే పాఠకుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోందని లైబ్రేరియన్ తెలిపారు.

ఎమ్మెల్యే హామీ.. నెరవేరదేమీ

మండలంలోని కనగర్తిలో మృతి చెందిన టీఆర్ఎస్ నాయకుడు నేనర్ల నాగభూషణంగౌడ్ పేరిట మండల కేంద్రంలో గ్రంథాలయం నిర్మిస్తామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదు. రైతువేదిక పక్కనే స్థలాన్ని కేటాయించినా, నిధులు మంజూరు కాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించి గ్రంథాలయ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

అద్దె భవనంతోనే సమస్య



అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయంలో సరైన వసతులు లేక పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. సొంత భవనాన్ని నిర్మించి పాఠకుల సమస్యలు పరిష్కరించాలి. అరకొర వసతుల కారణంగా పాఠకులు ఎక్కువగా రావడంలేదు.

– చల్ల జితేందర్‌రెడ్డి, కోనరావుపేట

వసతులు లేక ఇబ్బందులు



గ్రంథాలయ భవనంలో వసతులు లేక పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. భవనం కోసం ఇప్పటి వరకు సరైన స్థలం ఎంపిక జరుగలేదు. భవనానికి స్థలం నిర్ణయమైతే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. గదులు చిన్నగా ఉండడం వల్ల పాఠకుల సంఖ్య తగ్గుతోంది.

– కవిత, లైబ్రేరియన్

స్థలాన్ని కేటాయించాం



గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలాన్ని చూపితే నిధులిస్తామని చెప్పారు. రైతు వేదిక పక్కన గల 8 గుంటల స్థలాన్ని ఏడాది క్రితమే కేటాయించాం. అలాగే మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేసినా, స్థలాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.

– పోకల రేఖ, సర్పంచ్, కోనరావుపేట

రెపరెపలాడిన కాషాయ జెండా

- ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు
- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు



వేములవాడ: పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ బండ మల్లేశం

జిల్లాలో బీజేపీ 43వ ఆవిర్భావ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రాల్లో బీజేపీ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే కుట్రతో సీఎం కేసీఆర్ ఎంపీ బండి సంజయ్‌పై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని అన్నారు. వేములవాడలో పార్టీ కార్యాలయంలో జెండాను వేములవాడ ఎంపీపీ బండ మల్లేశం ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమతో పాటు నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర నాయకుడు, సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌రావు, పార్టీ మండల అధ్యక్షులు సంతోష్, జక్కుల తిరుపతి, గునుకుల రాజిరెడ్డి, పొన్నాల తిరుపతిరెడ్డి, గుడి రవీందర్‌రెడ్డి, చింతపల్లి వెంకటేశ్వరరావు, కసూరి కార్తీక్‌రెడ్డి, సిరిసిల్ల మున్సిపల్ వార్డు కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్యాదపు వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



వేములవాడరూరల్: పార్టీ కార్యాలయంలో ..



బోయినపల్లిలో..

రహదారులకు మహర్దశ

- రూ.7 కోట్లతో రెండు హైలెవల్ బ్రిడ్జిలు
- నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు మంజూరు అయినట్లు వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు తెలిపారు. మల్లారం రోడ్డులోని కట్టుకాలువ, శాత్రాజుపల్లి రోడ్డులోని గంజివాగులపై నిర్మించే హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం పనులకు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టుకాల్వపై రూ.3.50 కోట్లు, గంజివాగుపై రూ.3.25 కోట్ల వ్యయంతో బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. హన్మాజిపేట వద్ద నక్కవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరయినట్లు తెలిపారు. వీటితోపాటు మంత్రి కేటీఆర్ రూ.50 కోట్ల నిధులను వీటీడీఏకు జమ చేశారన్నారు. వీటితో రూ.18 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి, రూ.10 కోట్లతో బోనాల మంటపం, రూ.12 కోట్లతో గుడి చెరువు సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇచ్చిన వాగ్దానాల్ని పూర్తి చేసేందుకు ప్రజల దగ్గరకు వెళతామని, ఇందులో భాగంగానే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు కృష్ణవేణి, అజయ్, యాచమనేని శ్రీనివాస్‌రావు, నరాల శేఖర్, జయ, నిమ్మశెట్టి విజయ్ పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గురువారం రాత్రి రథంపై పుర వీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులు పట్టారు. సర్పంచ్ కల్యాణి, ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఉపసర్పంచ్ నీరజ, ఎంపీటీసీ లలిత, ఆలయ కమిటీ బాధ్యులు సతీష్‌చందర్, భాను, క్రాంతి, వేణు, మల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పల్లెపల్లెకూ ఓబీసీ ఇంటింటికీ బీజేపీ' కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు అందిస్తున్న బీజేపీ నాయకులు

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: మండలాల్లోని ఇపలు గ్రామాల్లో బీజేపీ నాయకులు పల్లెపల్లెకు ఓబీసీ–ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం బీసీల కోసం చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలను పట్టించుకోవడం లేదని, బీసీ కార్పొరేషన్ రుణాలు అందించడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ కార్యవర్గసభ్యులు బర్కం నవీన్, బీజేపీ మండల అధ్యక్షులు గంట అశోక్, బొమ్మడి స్వామి, ఓబీసీ విభాగం మండల అధ్యక్షుడు మురళీమోహన్‌గౌడ్, జిల్లా కన్వీనర్ మేకార్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు స్వామి, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

బోయినపల్లి: పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని గురువారం వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్, రూరల్ సీఐ భన్సీలాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటన జరుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కాగా బోయినపల్లి కేంద్రంలో 209, విలాసాగర్ కేంద్రంలో 65 మంది విద్యార్థులు హాజరయినట్లు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు..

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని మానేరు నది నుంచి వేబిల్లులతో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం తంగళ్లపల్లి సీఐ బి.ఉపేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై పోకాల లక్ష్మారెడ్డితో కలిసి ఇసుక ట్రాక్టర్ల నంబర్ ప్లేట్లు, వేబిల్లులు, డ్రైవర్ల యొక్క డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు. అనంతరం ట్రాక్టర్ ఓనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. మైనర్ల చేతికి ట్రాక్టర్లు ఇవ్వకూడదని, ఫిట్నెస్ రిజిస్ట్రేషన్లు, నెంబర్ ప్లేట్లు అమర్చాలని సూచించారు. కార్యక్రమంలో తంగళ్లపల్లి ఎస్సై బి.ఉపేందర్‌తోపాటు ఎస్సై పోకాల లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలు పరిమితికి లోబడి వైద్యం చేయాలి

కోనరావుపేట: ఆర్ఎంపీ, పీఎంపీలు పరిమితికి లోబడి వైద్యసేవలు అందించాలని ఎస్సై రమాకాంత్ అన్నారు. మండల ప్రైవేట్ వైద్యులతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో 24 గంటలు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్న వీరు ఆరోగ్య సంబంధ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏదైనా ప్రమాదాలు, గొడవల్లో గాయపడితే, తమకు సమాచారమిచ్చి వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి ఐదరి శ్రీనివాస్, జిల్లా సభ్యుడు తాళ్లపెల్లి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు బండ మల్లేశం, సీనియర్ వైద్యులు కాసర్ల మల్లేశం, బైరగోని రాజేశం, బద్దెపూరి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో 33 ఫీట్లతో రోడ్డు విస్తరణ పనులను సర్పంచ్ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. సంతోష్‌గౌడ్ ఇంటి నుంచి బొగ్గు సయ్యద్ ఇంటి వరకు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు విస్తరణకు ఇంటి యాజమానులు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో సమస్య పరిష్కారమైంది.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని 24వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ బుర్ర లక్ష్మి, కమిషనర్ సమ్మయ్య మాజీ ఎంపీటీసీ బుర్ర మల్లికార్జున్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని చీకోడులో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ చర్లపల్లి రజిత, ఎంపీటీసీ పడిగె సవిత గురువారం ప్రారంభించారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, ఉపసర్పంచ్ నాగరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, వైద్యాధికారి గీతాంజలి, సుధాకర్‌రెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ పిల్లి రేణుక పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు సన్మానం

చందుర్తి: హైదరాబాద్‌లో జరిగిన కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు బండి శ్రీనిత్య, నేరెళ్ల రక్షలను గురువారం హెచ్ఎం విక్రుర్తి లక్ష్మీనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ మింగని శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రాజకీయ దురుద్దేశంతో పేపర్ లీకేజీ డ్రామా'

గంభీరావుపేట: రాజకీయ దురుద్దేశ్యంతో బీజేపీ పేపర్ లీకేజీల డ్రామా మొదలు పెట్టిందని బీఆర్ఎస్ యువజన విభాగం మండల శాఖ అధ్యక్షుడు ఎడబోయిన రత్నాకర్, ప్రధాన కార్యదర్శి చిట్టంపెల్లి బిక్షపతి పటేల్ అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదో తరగతి హిందీ పేపర్ లీకేజీ వెనుక బీజేపీ నాయకుల హస్తం ఉందని అన్నారు. రాజకీయ స్వార్థం కోసం విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటమాడుతోందని ఆరోపించారు.

వైకుంఠధామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

ఎల్లారెడ్డిపేట: వైకుంఠధామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామని సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి అన్నారు. మండల కేంద్రంలోని వైకుంఠధామంలో త్రీఫేస్ లైన్ మంజూరు చేయాలని గ్రామస్తులు కోరిక మేరకు గురువారం పరిశీలించారు.

ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ప్రహరీ కూలి తల్లికూతుర్లు దేవవ్వ, అక్షయ మృతిచెందగా, తక్షణ సాయంగా మండల కేంద్రానికి చెందిన దోస్త్ యూత్ సభ్యులు రూ.5 వేల నగదు, నిత్యావసర సరుకులను దేవవ్వ భర్త నర్సయ్యకు గురువారం అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

గంభీరావుపేట: మండల కేంద్రంలో గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు గురువారం ప్రారంభించారు.

హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని రావిచెట్టు హనుమాన్ శోభాయాత్ర గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్‌పై హనుమాన్ ఫొటోను పూలతో అలంకరించి పురవీధుల్లో ర్యాలీ తీశారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు లింగం, నారాయణ, శ్రీనివాస్‌గౌడ్, బాలయ్య, రాంరెడ్డి, బొమ్మకంటి రవి, మేగి నర్సయ్య, దొంతి అమరేందర్‌రెడ్డి, నేవూరి శ్రీనివాస్‌రెడ్డి, సందుపట్ల లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, సురేందర్‌రెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.